క్లుప్తంగా...

బతుకమ్మ ఘాట్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: పట్టణంలోని కాముని చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, స్థానిక కౌన్సిలర్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాముని చెరువు వద్ద అసౌకర్యంగా ఉన్న పరిస్థితులను పరిష్కరిస్తున్నామని, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘాట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు లైటింగ్ ఏర్పాట్లు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు మురళీయాదవ్ తదితరులున్నారు.

సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

శంషాబాద్: సమాజాభివృద్ధిలో యువతది కీలకపాత్ర అని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ చైర్‌పర్సన్ మడపతి పరమేశ్వరి పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి యువత ఉద్యోగం లేదా స్వయం ఉపాధితో సాధికారతను సాధించాలన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములు కావాలన్నారు. జాబ్‌మేళాలో 34 కంపెనీలు పాల్గొనగా.. 650 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. 300 మంది నిరుద్యోగులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. మడపతి నరేందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అన్ని పార్టీలు టికెట్లు ఇవ్వాలి



వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

మణికొండ: వచ్చే శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అన్ని పార్టీలు టికెట్లు కేటాయించి అవకాశం కల్పించాలని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి కోరారు. ఆదివారం తమ అసోసియేషన్ కార్యవర్గసభ్యుల సమావేశాన్ని మణికొండలో నిర్వహించారు. ఏ పార్టీలు ఆర్యవైశ్యులకు అవకాశం కల్పిస్తే ఆ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను ఇవ్వాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ కేంద్రాల పరిశీలన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బతుకమ్మ చీరల సెంటర్ల పంపిణీ కేంద్రాలను జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారి రాధారాణి పరిశీలంచారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని 5 డివిజన్‌లలో 60 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ సెంటర్ల నుంచే బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఆదివారం సెలవుదినమైనా.. చీరలను పంపిణీ చేశామని, అన్ని సెంటర్ల ద్వారా 1500 చీరలను పంపిణీ చేశామన్నారు.

ఆయుష్మాన్ భారత్ నమోదుకు విశేష స్పందన

అత్తాపూర్: చైతన్య విలాస్ రామాలయం ప్రాంగణంలో నిర్వహించిన ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం జరిగిన ఈ నమోదు కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులను బీజేపీ సీనియర్ నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమామహేశ్వరిరెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల వనితా దామోదర్‌రెడ్డిలు అందజేశారు.

నేడు ఓల్డ్ లింగంపల్లిలో బస్తీ దవాఖానా ప్రారంభం

శేరిలింగంపల్లి: డివిజన్ పరిధిలోని ఓల్డ్ లింగంపల్లి విలేజీలో బస్తీదవాఖానాను సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ప్రారంభిస్తారని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకొచ్చేందుకు ఈ బస్తీదవాఖానాను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి



కర్ర పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: విజయకనకదుర్గా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీ విజయకనకదుర్గ దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యేతో కలిసి కర్రపూజ నిర్వహించారు. ఈ నెల 15 నుంచి ఆలయంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు మెడికల్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దసరా నవరాత్రి ఉత్సవాలను కాలనీలో ఆనందంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కాలనీ ప్రజలను కోరారు. దసరా కానుకగా కేసీఆర్ బతుకమ్మ చీరలను అందజేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మెడికల్ శీను, సతీష్, సీతారామాంజనేయులు, గోవిందరాజు, కుమార్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

నేడు రూ.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంషాబాద్: నేడు మున్సిపాలిటీలో హెచ్‌ఎండీఏ నిధులతో రూ. 50 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ సమీపంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించాలని భావించినా.. మంత్రి బీజీ షెడ్యూల్, ఎన్నికల నోటిఫికేషన్‌తో ఎమ్మెల్యేనే ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత ఆరోగ్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్‌కాలనీలోని జయదేవ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్‌క్యాంప్‌ను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాటేదాన్ పారిశ్రామికవాడలోని నిరుపేదలు, కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బంది ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పేదలకు తక్కువ ఫీజుతో వైద్యం అందించాలని ఆసుపత్రి నిర్వాహకులను కోరారు. డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్, ఆపద్బంధువు సేవాసమితి అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, సరికొండ వెంకటేష్, రఘుయాదవ్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రదర్శించొద్దు



డీడీ కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ సూచించారు. ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ డీడీ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హార్టికల్చర్ విద్యార్థుల ధర్నా



కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: ఉద్యాన శాఖలో ఉద్యాన అధికారులు, విస్తరణ అధికారుల నియామకాలు చేపట్టాలని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో విద్యార్థులు చేపడుతున్న ధర్నా ఆదివారంతో 5 వ రోజుకు చేరుకుంది. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం రోజుల తరబడి ధర్నాలు చేశామని తెలంగాణ వస్తే బతుకులు మారి, ఉద్యోగాలు వస్తాయని ఎంతో ఆశ పడ్డామన్నారు. ఆ ఆశ నిరాశగానే మిగిలిందని విద్యార్థులన్నారు. 5 రోజులుగా కళాశాలలో ధర్నా చేస్తున్నా.. ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వ ప్రతినిధి, సంబంధిత అధికారి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. స్పందించకుంటే రోడ్లపైకి వచ్చి ధర్నాను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వేదంతో పాటు ఆధునిక విద్య అవసరం



వేద పఠనం చేస్తున్న విద్యార్థులు

మణికొండ: పూర్వం వేదవిద్యను సమాజమే పెంచి పోషిస్తూ.. ఉన్నత సమాజ నిర్మాణానికి దోహదం చేసిందని, ప్రస్తుతం వేద విద్యను ప్రోత్సహించాలని విద్యారణ్యం వేద పాఠశాల స్థాపకులు శశిభూషణ సోమయాజి అన్నారు. యాచారం మండలం, చిప్పలపల్లి గ్రామంలో 7 ఎకరాల సువిశాల స్థలంలో 2015 నుంచి వేద పాఠశాల కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు వేదంతో పాటు సామాజిక, సాంస్కృతిక విషయాల పట్ల అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ఆధునిక విద్యను అందిస్తున్నామన్నారు. వేద పాఠశాల ప్రస్తుతం తాత్కాలిక భవనాలలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్నందున నూతన శాశ్వత భవనాలను నిర్మించాలనే ఉద్దేశంతో ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మై హోం అవతార్ కమ్యూనిటీహాల్‌లో భవన నిర్మాణ బ్రోచర్‌ను విడుదల చేశారు. ప్రముఖ న్యాయవాది రామకృష్ణ, బిల్డర్ చలపతిరెడ్డిలు పాల్గొని వేదవిద్యను సమాజం, భావితరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, దీనికి తమవంతు సహకారాన్ని పూర్తి స్థాయిలో అందిస్తామన్నారు. వేద విద్యార్థులు చేసిన పఠనం అందరినీ అలరించింది.

జాతీయ రెజ్లర్‌కు అభినందన

మణికొండ: హరియాణాలో జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ చాంపియన్ షిప్–2023లో నార్సింగికి చెందిన మణికాంత్‌యాదవ్ బంగారు పతకాన్ని సాధించారు. ఈ పోటీలలో పాల్గొని ఆదివారం నార్సింగికి చేరుకున్న విషయం తెలుసుకుని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, రెజ్లర్ మణికాంత్‌యాదవ్‌తో పాటు కోచ్ శ్రీకాంత్‌యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. నార్సింగి నుంచి జాతీయస్థాయి పోటీలలో పాల్గొనడంతో పాటు మూడు పతకాలను సాధించడం దేశానికి గర్వకారణమన్నారు. నాయకులు వెంకటేష్ ముదిరాజ్ తదితరులున్నారు.



రెజ్లర్ మణికాంత్‌యాదవ్‌ను అభినందిస్తున్న అశోక్‌యాదవ్

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



నార్సింగిలో ఇంటింటి ప్రచారంలో అశోక్‌యాదవ్

మణికొండ: కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం ప్రకటించిన ఆరు ఎన్నికల హామీలతో పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని, ఈసారి కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తామని ప్రజలు స్వచ్ఛందంగా చెబుతున్నారని నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని ప్రజలు అభినందిస్తున్నారని అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టికెట్ ఎవరికి వచ్చినా గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాయిరాం, మాజీ వార్డు సభ్యులు వెంకటేష్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఎరుకలు ఐక్యంగా ఉండాలి

గోల్కొండ: హక్కుల సాధనకు ఎరుకలు ఐక్యంగా ఉండాలని ఎరుకల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ సూచించారు. తెలంగాణలో అన్ని కులాల వారికి ఎన్నో పథకాలు అమలులో ఉన్నాయని, అయితే ఎరుకలకు మాత్రం అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయంగా కూడా ఎరుకలు వెనుకబడే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఎరుకలు ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఏకలవ్య విగ్రహాలు స్థాపించడానికి తాము నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా బాలాపూర్‌లోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఏకలవ్య విగ్రహ స్థాపనకు తనవంతు సాయంగా రూ.20 వేలు ఇస్తున్నానని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన చెక్కును ఆయన ఎరుకల సంఘం నాయకుడు శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘు, రాజు తదితరులున్నారు.

శివపురికాలనీ అధ్యక్షుడిగా దేవేందర్



నూతన కార్యవర్గంతో శివపురికాలనీ వాసులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శివపురి కాలనీ అధ్యక్షుడిగా జి.దేవేందర్, ఉపాధ్యక్షులుగా శివగంగ, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎ.రామస్వామి, సహాయ కార్యదర్శిగా నాగిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం చైర్మెన్ సాయిరెడ్డి, వైస్‌చైర్మెన్ యాలాల నరేష్‌ల ఆధ్వర్యంలో కాలనీవాసులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ రాబోయే రెండేళ్ల ఉంటుందని, కాలనీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేయాలని సూచించారు. సంక్షేమ సంఘం కోశాధికారిగా కృష్ణ, ఉప కోశాధికారిగా బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్. రమేష్, బుచ్చన్న, రమణ, రాజు, విష్ణులను ఎన్నుకున్నారు. నాయకులు లక్ష్మణ్, సిద్ధప్ప, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, అర్జున్, రాజనాథ్, హనుమంత్, కృష్ణ, మహాదేవ్, వెంకటేష్, రాములు తదితరులున్నారు.

'కేంద్రం నిధులతోనే రాష్ట్రాభివృద్ధి'



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

శంషాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ అన్నారు. ‘థ్యాంక్యూ మోదీజీ’ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నేతలు పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని లక్షల కోట్లు నిధులు అందజేశారన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం, పసుపుబోర్డు, కృష్ణా ట్రిబ్యునల్లను ప్రకటించడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో నిజాం పరిపాలన కొనసాగుతుందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆరోపించారు. కేంద్రం నిధులు విడుదల చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అంతకు ముందు ఆయా గ్రామాల నుంచి సేకరించి తీసుకొచ్చిన మట్టిని బీజేపీ కార్యాలయం ఏర్పాటుకు అందజేశారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: గిరిజన విశ్వ విద్యాలయం, పసుపు బోర్డు, కృష్ణా నీళ్ల ట్రిబ్యూనల్, 33 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లు ఏర్పాటును స్వాగతిస్తూ.. అత్తాపూర్ డివిజన్ గిరిజన మోర్చా అధ్యక్షులు శంకర్ చౌహాన్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఆదివారం ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ నాయకులు, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్, సత్యనారాయణ ముదిరాజ్, రాజు పహిల్వాన్, మ్యాడం రాము, విపిన్ చంద్ర, కార్యకర్తలు దేవేందర్ రాథోడ్, సుమన్ రాథోడ్, బీమా నాయక్ తదితరులున్నారు.

'రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'

విజయనగర్ కాలనీ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం కార్వాన్ శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద శౌర్య జాగరణ్ యాత్రకు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి సంబంధించిన వివిధ విభాగాలు ఎంతో పటిష్టంగా పని చేస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ విజయాలను ప్రజలకు తెలియజేయడంలో బీజేపీకి చెందిన మోర్చాల నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్, యోగ్‌రాజ్‌సింగ్ తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ చేయూత



శేరిలింగంపల్లి: వాచ్‌మన్ పిల్లల చదువుకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో చేయూత అందించారు. నల్లగండ్ల ప్రాంతంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న వెంకట్‌రెడ్డి పిల్లలు బిందు, నందకిశోర్ స్థానిక పాఠశాలలో 3, 4 తరగతులు చదువుతున్నారు. పిల్లల చదువు కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో రూ.20 వేలు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయకుమార్, అధ్యక్షుడు తోపుగుండ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, పేదలను ఆదుకోవడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని, ఇందులో భాగంగానే వాచ్‌మన్ పిల్లల చదువుకు చేయూత అందించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నూకల సందీప్, మధుసూదన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, మారం ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన హకీంపేట్‌లోని కమ్యూనిటీహాల్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరకాస్తు చేసుకుంటే వారికి తప్పకుండా చెక్కులు అందుతాయన్నారు. అయితే దరఖాస్తులో పొందుపరిచిన అన్ని రకాల ధ్రువపత్రాలు జతచేయడమే కాకుండా సరైన పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన హకీంపేట్‌లోని హరిజన కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యక్రమంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు జబ్బార్, మజీద్ తదితరులున్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

గౌలిపురా: గౌలిపురా డివిజన్ హనుమాన్‌నగర్ ఫేజ్–1లో శ్రీ హనుమాన్‌నగర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బస్తీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఛత్రినాక ఏసీపీ జి.రమేశ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ... నేరాలను నివారణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రతిఒక్కరూ తమ తమ బస్తీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బస్తీల్లో ఎలాంటి నేరాలు జరిగినా వాటిని వెంటనే ఛేదించేందుకు సీసీ కెమెరాలు ఉపయోపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక డీఐ శివ శంకర్, ఎస్సై. శ్రీకాంత్, అధ్యక్షులు పరశురాం, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి ఆర్.కృష్ణా రావు, సెక్రటరీ పోలోజు సంతోష్ కుమార్, విక్రం పాల్గొన్నారు.